
నేడే ఎన్నికల ఫలితాలు

వైరాలో విజయం ఎవరిని వరించేనో?

- పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపు మొదట..
- 14 టేబుళ్లు.. 18 రౌండ్లు
- గెలుపుపై భారీ బెట్టింగులు



వైరా: అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు నేడు తేలనున్నాయి. గత మూడు రోజుల ఉత్కంఠానికి తెర పడనుంది. ఎక్కడ చూసినా ఏ పార్టీ అభ్యర్థి గెలుపొందుతాడో.. గెలిస్తే ఎంత మెజార్టీ సాధిస్తాడో అనే చర్చలు జరుగుతున్నాయి. ఖమ్మం రూరల్ మండలం పొన్నెకల్‌లోని కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో ఓట్ల లెక్కింపుకు అధికారులు పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేశారు. ఉదయం 8 గంటలకే ఓట్ల లెక్కింపు ప్రక్రియను ప్రారంభించనున్నారు. మొదటిగా పోస్టల్ బ్యాలెట్లు లెక్కించనున్నారు.

అభ్యర్థుల్లో ఉత్కంఠ..

నియోజకవర్గంలో నాల్గోసారి జరుగుతున్న ఎన్నికల్లో మొత్తం 12 మంది అభ్యర్థులు పోటీలో నిలిచారు. ప్రధానంగా భూక్యా వీరభద్రం (సీపీఎం), బానోత్ మదన్‌లాల్ (బీఆర్‌ఎస్), మాలోత్ రాందాస్ నాయక్ (కాంగ్రెస్), బానోత్ రాంబాబు (బీఎస్పీ), గుగులోత్ భావ్‌సింగ్ (విద్యార్థుల రాజకీయ పార్టీ), సునావత్ వీరు (కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా మార్కిస్టు లెనినిస్టు లిబరేషన్), బానోత్ దుర్గా ప్రసాద్ (ఇండియన్ ప్రజా కాంగ్రెస్), మాలోత్ శ్యాంలాల్‌నాయక్ (అలయన్స్ ఆఫ్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ పార్టీ), ధనసరి వెంకటేశ్వర్లు (గోండ్వానా దండకారణ్య పార్టీ), సంపత్ నాయక్ (జనసేన), గుగులోత్ తావుర్యా (ఇండిపెండెంట్), వర్సా రాములు (ఇండిపెండెంట్) పోటీలో ఉన్నారు. ఫలితాల కోసం వీరంతా ఉత్కంఠగా ఎదురుచూస్తూ గెలుపు ఓటములపై నువ్వా.. నేనా అన్న పరిస్థితులు నెలకొన్నాయి. అయితే ప్రధాన పోటీ కాంగ్రెస్, బీఆర్‌ఎస్ అభ్యర్థుల మధ్యే ఉంటుంది. అందరు ఊహించినట్లే ఎన్నికల ఫలితాలు బానోత్ మదన్‌లాల్, మాలోత్ రాందాస్ నాయక్‌ల మధ్య తీవ్ర పోటీ నెలకొంది. నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో అధికార బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీ ల మధ్య గట్టి పోటీ ఉందన్న చర్చ సాగుతుంది. ఇరు పార్టీలకు చెందిన నాయకులు గెలుపు తమదే అని బారీ స్థాయిలో బెట్టింగులు కడుతున్నారు. రూ.1 లక్ష నుంచి రూ.50 లక్షల వరకు బెట్టింగులు కడుతున్నట్లు సమాచారం ఐదు మండలాల్లో బెట్టింగురాయుళ్లు బెట్టింగులతో గ్రామాల్లో ఉత్కంఠ వాతావరణం నెలకొల్పుతున్నారు. పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహిస్తున్నారు.

18 రౌండ్లు..


వైరా నియోజకవర్గంలో మొత్తం 1,93,069 ఓట్లు ఉండగా 1,67,389 ఓట్లు పోలయ్యాయి. మొత్తం 18 రౌండ్లలో 14 టేబుళ్లు ఏర్పాటు చేసి ఓట్లు లెక్కించనున్నారు. మొదటగా నియోజకవర్గంలో పోస్టల్ బ్యాలెట్లు 2076 లెక్కించి అనంతరం195 సర్వీస్ ఓట్లు కూడా లెక్కించనున్నారు. మధ్యాహ్నం 3 గంటల వరకు తుది ఫలితం వచ్చే అవకాశం ఉంది. జిల్లాలో మొదటి ఫలితం వైరాదే కావడం విశేషం. ఎన్నికల ఫలితాలు తెలుసుకునేందుకు అన్ని రాజకీయ పార్టీలతో పాటుగా సాధారణ ఓటర్లు సైతం ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.

కల్లూరులో కాయ్‌రాజా కాయ్..



కల్లూరురూరల్: అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపొందే అభ్యర్థులపై జోరుగా పందేలు కాస్తున్నారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థులు గెలుపుపై రూ.లక్షల్లో పందేలు కాస్తున్నారు. ముఖ్యంగా సత్తుపల్లి అభ్యర్థి సండ్ర వెంకట వీరయ్య గెలుస్తారని ఒక వర్గం, కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ మట్టా రాగమయి విజయం సాధిస్తారని మరో వర్గం నేతలు పందేలు కాస్తూ.. మధ్యవర్తుల సమక్షంలో డబ్బులు డిపాజిట్ చేయించడం, నమ్మకం ఉన్న వ్యక్తులతో అగ్రిమెంట్లు రాయిస్తూ పందేలు కాస్తున్నారు. ఈదే కాక ఖమ్మం, పాలేరు స్థానాలపై గెలుపుపై కూడా భారీ స్థాయిలో పందేలు నడుస్తున్నాయి.

ఎవరి లెక్కలు వారివే..!



అంచనాలన్నీ కొణిజర్లలోనే..

కొణిజర్ల: వైరా నియోజకవర్గ ఎన్నికల తతంగం ముగిసిన అనంతరం నేడు ఓట్ల లెక్కింపు ప్రారంభం అవుతుండగా నేతలు గెలపోటములపై లెక్కలు వేసుకుంటున్నారు. కొణిజర్ల మండలంలో అత్యధికంగా పోలింగ్ నమోదు కావడంతో నాయకుల అంచనాలన్నీ కొణిజర్ల మండలం మీదనే ఉన్నాయి. నియోజకవర్గంలోని ఓట్లలో దాదాపు 40 శాతం ఓట్లు కొణిజర్ల మండలంలో పోల్ కావడంతో అందరి అంచనాలు కొణిజర్ల మీదనే ఉన్నాయి. ఓ వైపు అధికార బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు తమకే 2 వేల నుంచి 3 వేలకు పైగా మెజార్టీ వస్తుందని చెబుతుండగా.. మరో వైపు కాంగ్రెస్ నాయకులు 3 నుంచి 4 వేల మెజార్టీ వస్తుందని లెక్కలు వేసి మరీ చెబుతున్నారు. పోలింగ్ బూతుల వారీగా పడిన ఓట్లను బట్టి తమకు ఎన్ని ఓట్లు పడి ఉంటాయో తాము ఎక్కడ మెజార్టీ సాధిస్తామో లెక్కలు వేస్తున్నారు. కొణిజర్ల, తనికెళ్లలో కాంగ్రెస్ బలంగా ఉన్నప్పటికీ తమకు గణనీయంగా ఓట్లు బదిలీ అయ్యాయని బీఆర్‌ఎస్ నాయకులు చెప్పుకొస్తున్నారు. మరో వైపు ప్రభుత్వ వ్యతిరేకత తమకు బాగా కలిసి వచ్చిందని, నిరుద్యోగ యువత వ్యతిరేక ఓటింగ్ తమకు భారీ మెజార్టీ తెచ్చి పెడుతుందని కాంగ్రెస్ నాయకులు చెబుతున్నారు. కొణిజర్ల మండలంలోని పలు గ్రామాల్లో దళితుల సంఖ్య ఎక్కువగా ఉండటంతో తమకు ఓట్లు వస్తాయని బీఎస్పీ నాయకులు అంచనా వేస్తున్నారు. బీజేపీ కూడా కొణిజర్ల, తనికెళ్లలో ఓ మోస్తారు ఓట్లు కలిగి ఉండటంతో ఆ ఓట్లు జనసేనకు పడతాయని గెలవకపోయినా తమకు మంచి ఓటింగ్ శాతం వస్తుందని ఆయా పార్టీల నాయకులు చెబుతున్నారు. ప్రధానంగా కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నాయకులు గెలుపు తమదంటే తమదంటూ లెక్కలు చెబుతున్నారు. చివరికి విజయలక్ష్మి ఎవరిని వరించనున్నదో నేడు తేలనుంది.

మద్యం దుకాణాల ముస్తాబు



విద్యుత్ వెలుగుల్లో వైన్స్

సత్తుపల్లిటౌన్: సత్తుపల్లి ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో శనివారం నుంచి నూతన మద్యం దుకాణాలు తెరుచుకున్నాయి. ఈ సందర్భంగా మద్యం దుకాణాలను మామిడి తోరణాలు, విద్యుత్ దీపాలతో అలంకరించి ముస్తాబు చేశారు. ఎక్సైజ్ సీఐ రాజశేఖరరావు మాట్లాడుతూ.. వేంసూరులో 4, పెనుబల్లిలో 5, కల్లూరులో 6, సత్తుపల్లిలో 8చొప్పున 23 మద్యం దుకాణాలను ప్రారంభమయ్యాయని, 2025వరకు అమలులో ఉంటాయని తెలిపారు.

వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరి



చిన్నారికి టీకా వేస్తున్న వైద్య సిబ్బంది

సత్తుపల్లిటౌన్: తొమ్మిది రకాల ప్రాణాంతక వ్యాధుల నుంచి చిన్నారులను రక్షించేందుకు క్రమం తప్పకుండా వ్యాధినిరోధక టీకాలు వేయించాలని గంగారం పీహెచ్‌సీ వైద్యులు ఆర్.అవినాష్ అన్నారు. శనివారం పీహెచ్‌సీ పరిధిలోని పలు అంగన్‌వాడీ కేంద్రాలు, ఆరోగ్య ఉపకేంద్రాల్లో జాతీయ వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లలకు హెపటైటీస్ బీ, డీపీటీ, పోలియో, మిజిల్స్, పెంటావాలెంట్ టీకాలు చేశారు. గర్భిణులకు టీటీ ఇంజక్షన్లు చేశారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు నరసింహారావు, అన్నమ్మ, ఏఎన్‌ఎంలు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.


రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

మధిరరూరల్: సిరిపురం–వంగవీడు గ్రామాల మధ్య శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తికి గాయాలయ్యాయి. మధిర నుంచి తన స్వగ్రామం కలకోటకు మోటార్ సైకిల్‌పై వెళ్తున్న కొనకంచి నరేష్‌ను ఎదురుగా వచ్చిన గుర్తుతెలియని వాహనం ఢీ కొట్టడంతో అతనికి తీవ్ర గాయాలు అయ్యాయి. స్థానికుల సమాచారంతో ఆర్కే ఫౌండేషన్ నిర్వాహకులు దోర్నాల రామకృష్ణ, జ్యోతి, సుదర్శన్ క్షతగాత్రుడిని అంబులెన్స్ వాహనంలో మధిర ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

అటెన్షన్ ప్లీజ్



చేతిపంపుపై పట్టింపేది..?



వైరా మండలంలోని తాటిపూడి గ్రామ పంచాయతీలో గల ఎస్టీ కాలనీలో గత కొన్నేళ్ల నుంచి చేతిపంపు నిరుపయోగంగా ఉంది. పల్లెల అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం పలు దఫాలుగా పల్లె ప్రగతి కార్యక్రమాలను ప్రవేశపెట్టి పనిచేయని చేతి పంపులను మరమ్మతులు చేయాలని సూచించిన పాలకవర్గాలు, సంబంధిత శాఖాధికారులు సమస్య పట్టనట్లు వ్యవహరించారు. ఒక్కోసారి కాలనీలో నీటిసమస్య తలెత్తిన సమయంలో ఈ చేతి పంపులే ఆసరాగా ఉండేవన్నారు. ఏళ్ల కిందట నుంచి చేతిపంపు పనిచేయకపోవడంతో ఇంటి అవసరాలకు వినియోగించుకునేందుకు నీరులేక ఇక్కట్లు పడాల్సి వస్తుందని కాలనీ వాసులు వాపోతున్నారు. అధికారులు ఇప్పటికైన చేతిపంపుకు మరమ్మతులు చేయించి ఉపయోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

\- వైరారూరల్

ప్రశ్నించాల్సిన అధికారి : వేణు, పంచాయతీ కార్యదర్శి, తాటిపూడి
సెల్ నంబర్ : 9550872038

క్లుప్తంగా

ఏన్కూరులో 144 సెక్షన్

ఏన్కూరు: మండలంలో ఎన్నికల కోడ్ ఈ నెల 5వ తేదీ వరకు అమల్లో ఉంటుందని ఎస్సై బాదావత్ రవి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం నుంచి సోమవారం వరకు విజయోత్సవ ర్యాలీలు, డీజేలు పెట్టి బైక్ ర్యాలీలు, బాణాసంచా కాల్చడం, ప్రజలు ఒకే చోట గూమిగుడి ఉండడం వంటివి చట్టరీత్యా నేరం అన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

బీటెక్ విద్యార్థికి ల్యాప్‌టాప్ వితరణ



విద్యార్థికి ల్యాప్‌టాప్ అందజేస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు

వైరా: మండలంలోని విప్పలమడక గ్రామానికి చెందిన నిరుపేద బీటెక్ విద్యార్థి లీలా కృష్ణ ప్రసాద్‌కు వైరా గ్రేటర్ విజన్ లయన్స్ క్లబ్ అధ్యక్షురాలు ఉండ్రు వరలక్ష్మి ఆధ్వర్యంలో ల్యాప్‌టాప్ సాయం అందించారు. ఈ సందర్భంగా క్లబ్ పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ కాపా మురళీ కృష్ణ మాట్లాడుతూ.. నిరుపేదలను ఆదుకోవడంలో లయన్స్‌క్లబ్ ఎప్పుడూ ముందుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో జీఎంటీ కో–ఆర్డినేటర్ డాక్టర్ ఉండ్రు శ్యాంబాబు, శ్రీకాంత్, కృష్ణారావు, కిషన్ రాయ్, రామకృష్ణ, కె.గోపి పాల్గొన్నారు.

కాంగ్రెస్ కార్యకర్తకు పరామర్శ



గురవయ్యను పరామర్శిస్తున్న కాంగ్రెస్ నాయకులు

మధిరరూరల్: మండలంలోని వంగవీడు గ్రామంలో అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా నవంబర్ 30న జరిగిన దాడిలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తకు గాయాలయ్యాయి. ఈ దాడిలో గాయపడిన సిద్దిపోగు గురవయ్యను శనివారం వంగవీడు గ్రామంలోని ఆయన నివాసంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సూరంశెట్టి కిషోర్, సీనియర్ నాయకులు ఐలూరి సత్యనారాయణరెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అధికార పార్టీలో ఉన్నామనే అహంకారంతో ఆ గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్, సర్పంచ్ కుమారులు గురవయ్యను దూషించి భౌతిక దాడి చేసి గాయపరిచినట్లు తెలిపారు. ఓటమి భయంతోనే అధికార పార్టీ నాయకులు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తపై దాడికి పాల్పడ్డారని ఆరోపించారు. పరామర్శించిన వారిలో యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు రవికుమార్, వెంకటేశ్వర్లు, లక్ష్మారెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, సురేష్, ప్రసాద్, రాంబాబు, కృష్ణ తదితరులు ఉన్నారు.

విద్యార్థుల దాహం తీర్చిన 'శెట్టిపల్లి'



బోరుకు మోటర్ ఏర్పాటు చేసిన దృశ్యం

ఏన్కూరు: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థుల దాహం తీర్చాడో వైద్యుడు. కళాశాల మోటర్ పాడై నెల రోజులుగా విద్యార్థులు తాగునీటికి ఇబ్బంది పడుతున్నారు. విషయం తెలుసుకున్న శెట్టిపల్లి నారాయణ, బసవమ్మ ట్రస్ట్ నిర్వాహకుడు నాగేశ్వరరావు రూ.15 వేలతో మోటార్, విద్యుత్ సామగ్రి వితరణగా అందించారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు కడియాల కోటేశ్వరావు, పిచ్చయ్య, ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ సుందర్‌రావు, కొవ్వూరు నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ముళ్లకంపతో ప్రయాణికుల అవస్థలు



ఎర్రుపాలెం-జయంతి రోడ్డుపై ముళ్లకంప

ఎర్రుపాలెం: రహదారిపై ఏర్పడిన ముళ్లకంపను తొలగించాలని వాహనదారులు, పాదాచారులు కోరుతున్నారు. ఎర్రుపాలెం మండలకేంద్రం నుంచి ఏపీ రాష్ట్రం ఎన్‌టీఆర్ జిల్లా వీరులపాడు మండలం జయంతి గ్రామానికి వెళ్లే పంచాయతీరాజ్ బీటీ రోడ్డులో ముళ్ల తుప్పలు అధికంగా పెరిగి ప్రయాణికులకు రాకపోకల సమయంలో ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. ఎదురుగా వచ్చే వాహనాలు ఏ మాత్రం కనిపించడం లేదు. రోడ్డు కూడా బాగా లేదు. కావున అధికారులు స్పందించి ముళ్లకంపను తొలగించి, మరమ్మతులు చేసి ప్రయాణికులను ఆదుకోవాలని కోరుతున్నారు.

ఘనంగా ఉదయాస్తమాన పూజలు



పూజల్లో పాల్గొన్న భక్తులు

మధిర: మధిర పట్టణంలోని లడక్ బజార్ అయ్యప్ప నగర్‌లో వేంచేసి ఉన్న అయ్యప్పస్వామి ఆలయంలో ఉదయాస్తమన పూజలు శనివారం ఘనంగా నిర్వహించారు. వేకువజామునే ఆలయ మండపంలో బిక్కి కృష్ణ ప్రసాద్, అనిత దంపతులు ఘనంగా గణపతి హోమం నిర్వహించారు. అనంతరం మండల పూజా కార్యక్రమంలో భాగంగా శబరిమల అయ్యప్పస్వామి సన్నిధిలో మాదిరిగా ఉదయాస్తమాన పూజ, శివేలి కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. పూజా కార్యక్రమాలను ఆలయ ప్రధాన అర్చకులు శబరి దినేష్, అర్చకులు మధు స్వామి ఆధ్వర్యంలో నిర్వహించారు. అయ్యప్ప స్వామి విగ్రహంతో నిర్వహించిన శివేలి ప్రదక్షణ కార్యక్రమంలో కృష్ణ ప్రసాద్ దంపతులతో పాటు అయ్యప్ప స్వామి మాలాదారులు, గురుస్వాములు పాల్గొన్నారు.

పాఠశాలలకు రంగులు



రంగులతో కళకళలాడుతున్న కమలాపురం జెడ్పీ ఉన్నత పాఠశాల

ఎలక్షన్ ఎఫెక్ట్

ముదిగొండ: తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యాన పోలింగ్ కేంద్రాల్లో వసతులు మెరుగుపరిచేందుకు ప్రభుత్వం ఎలక్షన్ నిధుల నుంచి అధికారులు హడావుడిగా పాఠశాలలకు రంగులద్దారు. ఎలక్షన్ ఈసీ ఆదేశాల మేరకు ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలగకూడదనే భావనతో పోలింగ్ కేంద్రాలకు పైపై మెరుగులు దిద్దారు. ముదిగొండ మండలంలోని 55పోలింగ్ కేంద్రాల్లో ఉన్నటువంటి వివిధ పాఠశాలల్లో మరమ్మతులతో పాటు, రంగులు వేశారు. కురుస్తున్న పాఠశాలలకు, శిథిలావస్థలో ఉన్న స్కూల్స్‌కు ఎన్నికల పుణ్యమా అంటూ మోక్షం కలిగింది. ఎన్నికల అనంతరం ఏ గ్రామం వెళ్లినా పాఠశాలలో రంగులతో కళ కళలాడుతున్నాయి. స్కూళ్లను ఏనాడు పట్టించుకోని ఏ అధికారి.. ఐదేళ్లకోమారు జరిగే ఎన్నికల వలన ఈ రంగుల మోక్షం కలిగింది.

రాష్ట్రస్థాయి పోటీలకు మహాలక్ష్మి ఎంపిక



మేడిశెట్టి మహాలక్ష్మి

మధిర: రాష్ట్రస్థాయి అండర్ 17 ఖోఖో పోటీలకు మాటూరు హైస్కూల్ విద్యార్థిని మేడిశెట్టి మహాలక్ష్మి ఎంపికైంది. ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియంలో శనివారం జరిగిన జిల్లా స్థాయి కో సెలక్షన్ పోటీల్లో మధిర మండలం మాదూరు హైస్కూల్ విద్యార్థిని మేడిశెట్టి మహాలక్ష్మి అండర్ 17 విభాగంలో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చెరుపల్లి శ్రీహరి తెలిపారు. ఈ విద్యార్థిని గత ఏడాది జరిగిన జాతీయస్థాయి ప్రతిభా ఉపకార వేతనాల పరీక్ష (ఎన్‌ఎంఎంఎస్)లో ఎంపికైనట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు స్వేచ్ఛాయుత వాతావరణంలో అన్ని రంగాల్లో ప్రతిభ చూపిస్తున్నట్లు హెచ్‌ఎం తెలిపారు. క్రీడల్లో విద్యార్థులను చక్కగా తీర్చిదిద్దుతూ ప్రత్యేక శిక్షణ అందిస్తూ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యే విధంగా కృషి చేస్తున్న పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయిని గుంటుపల్లి రమాదేవిని, విద్యార్థిని మేడిశెట్టి మహాలక్ష్మిని, హెచ్‌ఎంతో పాటు గ్రామ సర్పంచ్ మేడిశెట్టి లీలావతి, ఎంపీటీసీ సభ్యుడు అడపాల వెంకటేశ్వర్లు, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ మేడిశెట్టి రామకృష్ణారావు తదితరులు అభినందించారు.

నిరుపేదలకు అన్నదానం



అన్నదానం చేస్తున్న దాతలు

మధిర: మధిర పట్టణంలోని వర్తక సంఘంలో వేంచేసి ఉన్న శ్రీ కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గార్లపాటి చందర్‌రావు జ్ఞాపకార్థం కుమారుడు పురుషోత్తంరావు ఆర్థిక సహకారంతో నిరుపేదలకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమాన్ని ఆలయ అన్నదాన కమిటీ బాధ్యులు కపిలవాయి జగన్ మోహన్‌రావు ప్రారంభించి మాట్లాడుతూ.. అన్ని దానాల కన్నా అన్నదానం మిన్న అని తెలిపారు. కార్యక్రమంలో విజయ్, హేమ, నాళ్ల భరణి, ఉమామహేశ్వరి పాల్గొన్నారు.

గీతామందిరంలో..

సత్తుపల్లిటౌన్: పట్టణంలోని శ్రీ గీతాజ్ఞానమందిరంలో గల శ్రీ పార్థసారధి స్వామి ఆలయంలో శనివారం స్వామికి విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణానికి చెందిన మలిరెడ్డి మురళీరెడ్డి, కిరణ్మయి దంపతులు భక్తులకు అన్నదానం నిర్వహించారు. కొనకళ్ల మిధుస్ శ్రేయస్ పుట్టిన రోజు సందర్భంగా అన్నదానానికి వితరణ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ నిర్వాహకులు గుడివాడ వెంకటేశ్వరరావు, తిరునగరి వెంకటనర్సయ్య, కొనకళ్ల శంకరరావు, ఏపూరి పురుషోత్తం, శారద, రాఘవయ్య పాల్గొన్నారు.

ఈ–కేవైసీ కష్టాలు..



సువర్ణాపురం రేషన్ దుకాణంలో ఈ-కేవైసీ కోసం వేలి ముద్రలు సేకరిస్తున్న రేషన్ డీలర్ శ్రీనివాసరావు (ఫైల్)

- వేలిముద్రలు పడక తిప్పలు
- అప్‌డేట్ కోసం రేషన్ సెంటర్లకు పరుగులు
- వలస వెళ్లిన వారి కుటుంబాల్లో ఆందోళన
- ప్రత్యామ్నాయం చూపాలంటున్న ప్రజలు

ముదిగొండ: ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా రేషన్ దుకాణాల నుంచి బియ్యం, ఇతర సరుకులు తీసుకునేందుకు కేవైసీ(నో యువర్ కస్టమర్–మీ వినియోగదారుని తెలుసుకోండి) నమోదు తప్పనిసరి అంటున్నాయి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు. రేషన్ దుకాణాల్లో అప్‌డేట్ చేసిన ఈ పాస్ మిషన్ల ద్వారా కార్డులో నమోదు అయినవారందరి వేలి ముద్రలు తీసుకుని, వారి వివరాలు నమోదు చేసుకునే ప్రక్రియ ప్రస్తుతం మందకోడిగా సాగుతుంది.

వేలిముద్రలు తప్పనిసరి..

ఈ–కేవైసీకి గత రెండు నెలల నుంచి శ్రీకారం చుట్టారు. లబ్ధిదారుల వేలి ముద్రలు వేయకుంటే రేషన్ కార్డులో పేరు నమోదు కాదు. ఇతర రాష్ట్రాల్లో ఉండే వారు కూడా వచ్చి ఈ–కేవైసీ నమోదు చేసుకోవాలని అధికారులు చెబుతున్నారు. పౌరసరఫరాల సంస్థ కూడా ప్రభుత్వాల ఆదేశాల అనుగుణంగా ఈ పాస్ మిషన్లను అప్‌గ్రేడ్ చేసి కార్డుదారుల వేసి ముద్రలు తీసుకోవాల్సిందిగా రేషన్ దుకాణాదారులకు గతంలో చెప్పింది.

మండలంలోని 37 రేషన్ దుకాణాలు..

ముదిగొండ మండలంలోని 25 గ్రామపంచాయతీలలో 33 గ్రామాలకు గానూ.. 37రేషన్ దుకాణాలున్నాయి. ఈ రేషన్ కార్డు దుకాణాలలో అంత్యోదయ అన్నపూర్ణ, రేషన్‌కార్డు దారులున్నారు. ప్రతీ దుకాణంలో వేలిముద్రలు వేసేందుకు కొంత అవగాహన లేకపోవడంతో పాటు, జాప్యం జరుగుతుంది.

దీంతో విదేశాల్లో ఉన్నా, ఇతర రాష్ట్రాల్లో ఉన్నా, వేలు ముద్రలు వేయకుంటే పేర్లు నమోదు కాదు. దీంతో కార్డులో ఉన్న ఆ లబ్ధిదారుడి ఇచ్చే రేషన్ ఇవ్వడం జరగదు. కావున అధికారులు గ్రామాల్లో పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని, దీనికి గడువు ప్రకటించకూడదని లబ్ధిదారులు కోరుతున్నారు.

ఇప్పటి వరకు 50 శాతం మాత్రమే..

అధికారులు దీనిపై దృష్టి పెట్టకపోవడంతో ఇప్పటి వరకు ముదిగొండ మండలంలో 50శాతం మాత్రమే ఈ–కేవైసీ పూర్తైంది. పూర్తి కాకపోయినా లబ్ధిదారులకు రేషన్ సరఫరా చేయాలని ఆదేశాలున్నాయి. గ్రామాల్లో రేషన్ దుకాణాల్లో లబ్ధిదారులకు పోర్టబులిటీ ఉన్నందున ఎక్కడైనా వేలిముద్రలు వేయొచ్చని చెబుతున్నారు. గ్రామాల్లో ఇకనైనా అవగాహన కల్పించి కేవైసీ నూరుశాతం పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత సంబంధిత అధికారులు, దుకాణాదారులపై ఎంతైనా ఉంది.

గడువు తేదీ ఏమీ లేదు..



ఈ–కేవైసీకి గడువు అంటూ ఏమీ లేదు. కేవైసీలో వివరాలు ఇవ్వని కార్డుదారుల పేర్ల విషయంలో ఎలాంటి ఆదేశాలు లేవని, ప్రభుత్వ ఆదేశాలలో భాగంగా వేలి ముద్రలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ–కేవైసీకి అందరికి వేలు ముద్రలు తప్పనిసరి. లబ్ధిదారులు అవగాహన కలిగి వినియోగించుకోవాలి. అన్ని గ్రామాల్లో పూర్తి చేయాలని రేషన్ డీలర్లకు చెప్పాం.

– రామారావు, తహసీల్దార్, ముదిగొండ

ఈ–కేవైసీ చేసుకోవాలి..



రేషన్ కార్డుల లబ్ధిదారులు తప్పనిసరిగా ఈ–కేవైసీ నమోదు చేసుకోవాలి. గడువు ఉన్నందున లబ్ధిదారులకు రేషన్ ఆపడం లేదు. దీంతో పాటు ఈ–కేవైసీ దుకాణాల్లో కొనసాగుతూనే ఉంది. కుటుంబ సభ్యులు ఎంతమంది అయితే ఉన్నారో, వారు వచ్చి వివరాలతో పాటు వేలి ముద్రలు వేయించుకోవాలి. దూరప్రాంతాలు వారి వేలి ముద్రలు కూడా తప్పనిరి.

– కనపర్తి శ్రీనివాసరావు, రేషన్ డీలర్ల సంఘం మండల అధ్యక్షుడు, సువర్ణాపురం